# సుబ్రహ్మణ్య భక్తుల పర్వదినం నాగుల చవితి



సర్పరూపుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడిని పూజించే పండుగ నాగులచవితి. ఈ పండుగని ప్రతీ సంవత్సరం కార్తీక శుద్ధ చవితినాడు జరుపుకుంటారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో శ్రావణ శుద్ధ చవితి నాడు కూడా జరుపుకుంటారు. శ్రావణ శుద్ధ పంచమిని 'నాగపంచమి'గా జరుపుకుంటారు.

ఈరోజు ఏంచేయాలి?

నాగుల చవితి నాడు ఆచరించాల్సిన విధులను గురించి, పూజా విధానం గురించి స్వయంగా శివుడే పార్వతీదేవికి వివరించినట్లు స్కాందపురాణంలో ఉంది.
నాగుల చవితి నాడు గుమ్మానికి ఇరుపక్కల గోమయంతో సర్ప చిత్రాలు రాసి పూజించాలి. చతుర్థినాడు ఉపవాసం ఉండి పంచమినాడు బంగారంతోగానీ, వెండితోగానీ, కర్రతోగానీ, లేదంటే మట్టితోనైనా ఐదు పడగల సర్పాన్ని చేయించాలి. పసుపుతోగానీ, చందనంతోగానీ ఐదు లేదా ఏడు పాముల బొమ్మలను గీయవలెను. వీటిని భక్తి శ్రద్ధలతో సంప్రయబద్ధంగా పూజించాలి. పంచమినాడు పాలు, పాయసం వంటి వాటిని నైవేద్యం పెట్టాలి. ఈ రెండు రోజులూ పగలుగానీ, రాత్రి గానీ భూమినీ దున్నడం గానీ, తవ్వడం గానీ, భూమిలో బొరియలు ఉంటే వాటిని పూడ్చడం చేయరాదు.

నాగుల చవితిరోజు స్త్రీలు పుట్ట దగ్గరకు వెళ్ళి పుట్టను షోడశోపచారాలతో పూజించి, పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పిస్తారు. అంతే కాకుండా వెండితోగానీ, రాగితో గానీ పాము విగ్రహం తయారు చేయించి, దానిని పూజామందిరంలో ప్రతిష్టించి పూజలు చేస్తారు. నువ్వులు, బెల్లము కలిపి చేసిన నువ్వుల పిండిని, బియ్యపు పిండి, బెల్లముతో చేసిన చలిమిడిని నైవేద్యంగా సమర్పిస్తారు. చవితినాడు ఉపవాసం ఉండి, మరునాడు సర్పంకు షోడశోపచార పూజ చేసి నైవేద్యంను సమర్పిస్తారు. నాగరాజును పూజిస్తే ఇటు శివుడు, అటు విష్ణుమూర్తి కూడా తమకు అనుగ్రహిస్తారని భక్తుల నమ్మకం.
దేశ విదేశాలలో నాగపూజ
భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల్లోనూ 'నాగపూజ' అతి పురాతన కాలం నుంచి ఉంది. గ్రీకులకు నాగశక్తిపై అత్యంత విశ్వాసం ఉన్నందువల్ల అలెగ్జాండ్రియాలో గల చర్చిలో ప్రాణాలతో ఉన్న నాగుపాముల్ని ఉంచుతారు.

బైబిల్ ప్రారంభంలో ఏడమ్, ఈవ్ కథలో సృష్టి రచనా సమయంలో చెట్టుని చుట్టుకుని ఉన్న ఒక సర్పాన్ని వర్ణించారు. మెక్సికోలో సూర్యమందిరాల్లో సర్పశిలలున్నాయి. చైనాలో సేనాపతి జెండాపై 'డ్రాగన్' చిత్రం శోభిస్తూ ఉంటుంది. టిబెట్‌లో సునాగుడనే రాజు పాటలీ సరోవరంలో ఉన్నట్టుగా చెప్పబడింది. కొరియా, నయాం, ఇండోనేషియా, కాంబోడియా మొదలైన దేశాలలో సర్పచిత్రాలు కనిపిస్తున్నాయి.

ప్రాచీన కాలంలో సూర్యోపాసన ఉండేదని, సూర్యుని ప్రతీక బహుశా సర్పమై ఉండవచ్చుననీ, ఈ విషయమే కొత్త రూపంలో ఏడమ్, ఈవ్, సైతన్ కథలోకి వచ్చిందనీ డాక్టర్ రె.డీన్ పండితుని అభిప్రాయం. డా.ఓల్డ్ హూమ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అజంతా, సారనాథ్‌లలో నాగరాజుల శిరస్సులపై 'పంచముఖ' నాగ ఫణాల చిత్రాలు ఆశీర్వాద రూపంలో ఉన్నాయి. నాగరాణి శిరస్సుపై ఒకే ఫణం టోపీలాగ ఉంటుంది. హుయాన్ సాంగ్ భారతదేశం వచ్చినపుడు నాగరాజు కన్య ఫణయుక్త మకుటం కలిగి ఉండడాన్ని చూసినట్టుగా చెప్పాడు. పై ఉదాహరణలను పరిశీలిస్తే ప్రాచీన కాలం నాటి ప్రజలు సూర్యోపాసకులనీ, సూర్యుని ప్రతీకయే సర్పమనీ మనకు విదితమవుతుంది.

ప్రాచీనకాలంలో భారతవాసులు కూడా సూర్యోపాసకులై ఉండవచ్చును. నాగపూజ కూడా పురాతన కాలం నుంచి వస్తూ ఉంది. పంజాబ్‌లో మిరాసీ ప్రజలు నాగపూజతోనే తమ జీవితాన్ని గడుపుకుంటారు. ఈ జాతి స్త్రీలు నాగుల బొమ్మల్ని చేసి అమ్ముతారు. అలాగయితే నాగుపాము వాళ్లింట్లోకి రాదని విశ్వాసం. దక్షిణ భారతదేశంలో పుట్ట (వల్మకం)లో ఉండేనాగుని పూజించడం మనకి విదితమే. మహారాష్ట్రలో ప్రాణంతో ఉన్న సర్పాన్ని తెచ్చి పురవీధుల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. గుజరాత్‌లో కృష్ణసర్పాన్ని పూజిస్తారు. అక్కడ నాగుల్ని ఎవరూ చంపరు. పొరపాటున చంపినా శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు చేస్తారు. సంతానం లేని స్త్రీ నాగ పంచమి నుంచి మూడు సంవత్సరాల వరకు ప్రతీ పంచమినాడు నాగపూజ చేస్తే పుత్రప్రాప్తి పొందుతుందని నమ్ముతారు.

కేరళలో నాగులకు నైవేద్యాలర్పిస్తారు. అలాగయితే లక్ష్మీదేవి ప్రసన్నమవుతుందని వీళ్ల విశ్వాసం. ధ్రాంగధ్రా, చంబా, కొంగడా, కాశ్మీర్‌లలో నాగుల ఆలయాలున్నాయి. చీనాబ్ నదీ తీరంలో వాసుకి నాగుని ఆలయముంది. కాశ్మీరు రాజులు కర్కోటక నాగుని వంశస్థులని రాజతరంగిణిలో ఉంది. నాగరాజులను ఉదయ సాయంకాలలో హిందువులు పూజిస్తారు.

'శాంతాకారం భుజగ శయనం పద్మనాభం' మనం ప్రార్థన చేసే పద్యంలో విష్ణుదేవుని పాన్పుగా శేషుని వర్ణన ఉంది. శివకవచమ్‌లోను, శివపంచాక్షరిలోను, శివాష్టకమ్‌లోను, దేవిస్తోత్రంలోను శివుని ఆభరణాలుగా నాగుల్ని వర్ణించారు. రామాయణంలో సీతాదేవికి లంకలో కాపలా ఉన్న సురస నాగవంశానికి చెందినదే. శ్రీకృష్ణుడు కాళీయ సర్పాన్ని మర్ధించాడు.

బలరాముడు శేషుని అవతారం. అర్జునుడు ఉలూచి అనే నాగకన్యను వివాహమాడాడు.

క్షీరసాగర మథనంలో దేవదానవులు సర్పాన్ని ఉపయోగించారు. జనమే జయుని నాగయజ్ఞం భారతంలో వర్ణించబడింది. ఈ నాగులు జలాశయాలలోను, పర్వత ప్రాంతాలలోను ఉన్నట్టు మన పురాణాలు చెబుతున్నాయి. దేశంలో విభిన్న ప్రాంతాలలో రావిచెట్టు కింద నాగ విగ్రహాలు ఉంటున్నాయని, ఈ చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తే సంతానం కలుగుతుందని భారత మహిళల విశ్వాసం.